# సాక్షి మంచిర్యాల


శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023






**ఆదివాసీ గూడెం నుంచి అసెంబ్లీకి..**

కొండ కోనల్లో విసిరేసినట్లుగా ఉండే కల్లూరు గూడ నుంచి వెడ్మ బొజ్జు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. ఆదివాసీల సమస్యలపై అలుపెరుగని పోరాటంతో అసెంబ్లీ బాటపట్టాడు. 8లో▸



**చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం**

బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని ప్రతిపాదించారు. ఈ మేరకు 19 మంది కౌన్సిలర్లు గురువారం కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0 /19.0

**వాతావరణం**

ఉదయం వేళ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### రాష్ట్రంలో రూ.6 లక్షల కోట్ల అప్పు

- అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తాం
- చెన్నూర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి



మాట్లాడుతున్న గడ్డం వివేక్‌వెంకటస్వామి

చెన్నూర్: తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన సమయంలో రూ.60 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.6 లక్షల కోట్లు అప్పులు చేసి అప్పుల రాష్ట్రంగా మార్చారని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి విమర్శించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా చెన్నూర్‌కు వచ్చిన ఆయనకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక కార్యాలయంలో వివేక్‌కు సన్మానించారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, బ్యాక్ వాటర్ సమస్య ఏడాదిలోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతామని వస్తున్నారని, ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని తీసుకోకుండానే ప్రజలు 37 వేల మెజార్టీతో గెలిపించారని తెలిపారు. పార్టీకి కొత్తగా వచ్చే వారు అవసరం లేదని, తన కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్, సదానందం, చిలువేరు మల్లిక్ పాల్గొన్నారు.


### ప్రయోగాలతో పాఠాలు బోధించాలి



ప్రయోగం చేస్తున్న ఉపాధ్యాయుడు

దండేపల్లి: సైన్స్ పాఠాలను ప్రయోగాల ద్వారా బోధిస్తేనే విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందని జిల్లా పరిశీలకుడు గిరీష్‌కుమార్ అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం గురువారం నిర్వహించారు. గిరీష్‌కుమార్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్‌గౌడ్, రీసోర్స్ పర్సన్ పాత రమేష్, సీఆర్పీ గరిగె నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'సింగరేణిలో మళ్లీ జెండా ఎగురవేద్దాం'



మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

శ్రీరాంపూర్: సింగరేణిలో మరోసారి గులాబీ జెండా ఎగరవేద్దామని ఆ యూనియన్ గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. గురువారం హైదరాబాదులోని తన కార్యాలయంలో యూనియన్ నాయకులతో ఆమె సమావేశం అయ్యారు. సింగరేణి కార్మికులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో మేలు చేశారని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా కూడా వారసత్వ ఉద్యోగాలను కల్పించారని తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కులు, ప్రయోజనాలను కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడూ రాజీపడలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సింగరేణికి ప్రాధాన్యత ఉండదని, కార్మికులకు ఎలాంటి మేలు జరగదని ఆరోపించారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత యూనియన్‌పై ఉందన్నారు. గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్, ముఖ్యమంత్రిగా కేసీఆర్ కార్మికులకు చేసిన మేలును క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయికి ఎంపిక

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని కేంద్రీయ విద్యాలయం ఏడో తరగతి విద్యార్థిని బండి నికిత జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14, 15, 16వ తేదీల్లో ఢిల్లీలో జరిగే పాల్గొంటుంది. విద్యార్థినిని గురువారం జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కరాటే మాస్టర్స్ మోకెనపల్లి నరేశ్, మోకనపల్లి నాగలక్ష్మి, శ్రీధర్ అభినందించారు.

# తెరుచుకున్న బెల్ట్!



దండేపల్లి మండలం గూడెంలో ఓ బెల్టుషాపు



జైపూర్ మండలం టేకుమట్లలో ఇంటిలోనే బెల్టుషాపు నిర్వహణ

- ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ దందా
- రాత్రింబవళ్లు మద్యం విక్రయాలతో అనర్థాలు
- ఆదాయంపైనే ఆబ్కారీ శాఖ అధికారుల దృష్టి
- ప్రతీ వైన్స్ నుంచి నెలవారీగా మామూళ్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల కోడ్ ముగియడంతో జిల్లాలో మళ్లీ బెల్ట్ షాపుల్లో మద్యం దందా మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై నిషేధం పకడ్బందీగా కొనసాగింది. దీంతో అధికారికంగా ఉన్న ఏ4 వైన్స్ షాపులు, బార్లలో మద్యం అమ్మకాలు సాగాయి. ఈ నెల 5న ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో ఎక్కడికక్కడ మద్యం అక్రమ దందా మళ్లీ మొదలైంది. జిల్లాలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అక్రమంగా బెల్ట్‌షాపుల్లో అమ్మకాలు సాగుతున్నాయి. కిరాణా దుకాణాలతోపాటు రోడ్డు పక్కన గల్లీలు, వాడలు, పట్టణాల్లో అనధికారికంగా మళ్లీ బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు నడుస్తున్నాయి. ఇక ప్రతీ రెండేళ్లకోసారి మద్యం దుకాణాలు టెండర్లు వేసి లక్కీడ్రాలో వచ్చిన వారే దుకాణాలు నిర్వహిస్తుంటారు. 2023–25 రెండేళ్ల కాలానికి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగానే టెండర్లు పిలిచి లక్కీడ్రా నిర్వహించి ఆ ప్రక్రియ ముగించారు. గత ఆగస్టులో డ్రాలో దుకాణాలు దక్కించుకున్న వారంతా ఈ నెల ఒకటి నుంచే అమ్మకాలు ప్రారంభించారు. నిర్ణీత లైసెన్స్ ఫీజులు చెల్లించి కొత్తగా డిపోల నుంచి స్టాక్ తెచ్చుకుని గత వారం రోజులుగా విక్రయాలు సాగిస్తున్నాయి. ఓ వైపు అధికారికంగా, మరోవైపు అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.

**24గంటలు అందుబాటులో..**

జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 73 ఏ4 మద్యం షాపులు, 16 బార్లు ఉన్నాయి. గత ప్రభుత్వం కొత్త మండలాలు, మున్సిపాలిటీలకు సైతం మద్యం దుకాణాలు మంజూరు చేయడంతో ఈ సంఖ్య పెరిగింది. అధికారికంగా నిర్వహించే వైన్స్ షాపులతో పోలిస్తే ఎక్కువగా బెల్టుషాపుల్లోనే అమ్మకాలు సాగుతాయి. జిల్లాలో ప్రతీ గ్రామం, పట్టణంలో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు వెలిశాయి. వందల సంఖ్యలో ఉన్న అనధికార విక్రయాలతో వైన్స్‌లతో పోటీ పడుతూ మద్యం అమ్మకం సాగుతోంది. బెల్టుషాపుల్లో తెల్లవారు నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మద్యం అమ్మకాలు గుట్టుగా సాగుతున్నాయి. అధికారిక వైన్స్‌లో ఉదయం పది నుంచి రాత్రి 10గంటల వరకే అమ్మకాలు సాగించే అవకాశం ఉంది. అయితే ఆ తర్వాత బెల్టుషాపుల్లో మాత్రం రోజంతా ఎప్పుడైన మద్యం అందుబాటులో ఉంటోంది. నిత్యం మద్యం అమ్మకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని వారు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. వేడుకలు, పండుగలు, సంబరాల వేళ యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న వాటిలో చాలా వరకు మద్యం సేవించిన ఘటనలే ఉన్నాయి. ఇక భార్యాభర్తలు, ఇంటి గొడవల్లోనూ మద్యం చిచ్చు పెడుతోంది. అనేక మంది సంసారంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల శ్రీరాంపూర్ పరిధిలో ఆర్కే6 కొత్త రోడ్‌లో వైన్స్ ఏర్పాటుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కన్నెపల్లి మండల కేంద్రంలోనూ వైన్స్ షాపు ఏర్పాటు చేయొద్దని అక్కడి స్థానికులు నిరసన వ్యక్తం చేశారు.

**అధికారులకు ఆదాయంపైనే దృష్టి**

గుడుంబా, దేశీదారు, పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం రవాణాపై ఆబ్కారీ అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. కళ్లముందే అక్రమంగా సాగుతున్న బెల్టుషాపులను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏటేటా పెంచుతున్న ఆదాయం మేరకు వైన్స్‌లకు ఆరోజు వారీగా ఆదాయ లక్ష్యంపైనే దృష్టి సారిస్తున్నారు. ఎక్కడైనా ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తూ.. పకడ్బందీగా నిఘా పెట్టడం లేదు. వైన్స్ పరిధిలో రిటైల్ అమ్మకాలు తక్కువగా ఉంటాయి. అమ్మకాలు పెంచి, పెద్దమొత్తంలో సరకు కొనుగోలు చేసేవి బెల్టుషాపులే. దీంతో ఒక్కో షాపు పరిధిలో ఎన్ని బెల్టుషాపులు ఉంటే అంతగా అమ్మకాలు ఉంటాయి. దీంతో అధికారులు సైతం తమ లక్ష్యం చేరుకునేందుకు ఒక్కో వైన్స్ పరిధిలో ఎన్ని అక్రమంగా బెల్టు దుకాణాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. ఇక వైన్స్‌ల్లో కొనుగోలు చేసిన మద్యానికి రూ.10నుంచి రూ.20 అధికంగా బెల్టు షాపు నిర్వాహకులు అమ్ముతున్నారు. కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో మహారాష్ట్ర పరిధిలో గడ్చిరోలీలో నిషేధం ఉండడంతో అటు వైపు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చాలామంది రాజకీయ నాయకులు, బడా వ్యాపారులే ఏళ్లుగా లిక్కర్ దందా చేస్తున్నారు. కొన్ని చోట్ల స్లీపింగ్ పార్టనర్స్‌గా అధికారులు కూడా ఉన్నారు. కొన్ని చోట్ల మద్యం దుకాణదారులు సిండికేట్‌గా మారడం, లక్కీ డ్రాలో వచ్చినవారు కాకుండా షాపును కొనుగోలు చేసి వేరే వ్యక్తులు దందా చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ఏ అధికారి పట్టించుకోవడం లేదు. ఇక పోలీసు, ఎక్సైజ్ వారిని ఒక్కో షాపు పరిధిలో నెలకు ఇంత అని 'మామూళ్లు' వసూలు చేస్తుండడంతో వైన్స్‌లు, బెల్టుషాపుల దందా సాగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

## తొలి విడతలో దక్కని చోటు

- మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం కరువు
- రెండో దఫా విస్తరణపైనే ఆశలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ సర్కారులో తొలి రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరికీ చోటు దక్కలేదు. రాష్ట్రంలో హైదరాబాద్, ఉమ్మడి జిల్లా నుంచి మినహా అన్ని చోట్ల ప్రాతినిధ్యం కల్పించారు. మొదటి కేబినెట్ విస్తరణలోనే ఒకరికైనా చోటు ఖాయమని అంతా భావించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార సమయంలోనే మరో 11మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం తొలి కేబినెట్ సమావేశం కూడా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, గడ్డం వివేక్, వెడ్మ బొజ్జు ఉన్నారు. వీరిలో ఒకరికి కచ్చితంగా వీలుంటే ఇద్దరికీ మంత్రివర్గంలో చోటు ఖాయమని హామీలు వచ్చాయి. ఎమ్మెల్యేలు సైతం ఇదే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ మొదటి మంత్రివర్గ విస్తరణలో అవకాశం రాలేదు. రాష్ట్ర మంత్రివర్గంలో సీఎంతో సహా మొత్తం 18మంది మంత్రి వర్గంలో ఉండొచ్చు. ప్రస్తుతం సీఎంతో కలిపి మొత్తం 12మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక మిగిలిన ఆరుగురు మంత్రుల్లోనే ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు లేదా ఇద్దరికి అవకాశం దక్కవచ్చు. రెండో విడత కేబినెట్ విస్తరణలో ఎవరికి చోటు దక్కుతుందోనని చర్చ నడుస్తోంది. ఇక స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ ఎంపిక చేసిన క్రమంలో డిప్యూటీ స్పీకర్‌గా మరొకరికి అవకాశం ఇవ్వొచ్చు. వీటితోపాటు మంత్రి తర్వాత కేబినెట్ హోదా కలిగిన చీఫ్ విప్, విప్ పదవులు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సామాజిక తూకంలో భాగంగా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి రేసులో ఉన్న ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు గడ్డం సోదరులు, వెడ్మ బొజ్జుకు కూడా తగిన ప్రాధాన్యత ఉంటుందని పార్టీ అధిష్టానం నుంచే ఇప్పటికే హామీలు వచ్చాయి. రెండో దఫా మంత్రివర్గ విస్తరణ పూర్తయితేనే ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు ఉంటుందనే తేలనుంది.

# సింగరేణిలో వేడెక్కిన ప్రచారం



గనులపై నేతల ప్రసంగాలను తిలకిస్తున్న కార్మికులు

- ఈ నెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు
- గనులపై మొదలైన ఎన్నికల హడావుడి
- చేరికలపై దృష్టి సారించిన సంఘాల నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం రోజు రోజుకు వేడెక్కుతోంది. ఈ నెల 27న ఎన్నికల నేపథ్యంలో గనులపై కార్మిక సంఘాల ప్రచారం సాగుతోంది. నిన్న మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల్లో మాతృపార్టీలతో కలిసి కార్మిక వాడల్లో ప్రచారం చేసిన కార్మిక సంఘల నాయకులు ఇప్పుడు సింగరేణిలో తమ గెలుపు కోసం గనులపై ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికలకు ఇంకా 19 రోజులే ఉండడంతో ప్రతీ రోజును సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ చేపట్టారు. మాతృపార్టీల నేతలు కొందరు గెలిచిన ఆనందంలో.. మరి కొందరు ఓడిన బాధలో సింగరేణి క్షేత్రానికి రావడం లేదు. ప్రస్తుతానికి కార్మిక సంఘాల నాయకులే ప్రచారాన్ని తమ భుజాలపై మోస్తున్నారు. 13 సంఘాలు ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి. వీటిలో ప్రధానంగా ఏఐటీయూసీ నాయకులు అసెంబ్లీ ఫలితాలు వచ్చిన మరుసటి రోజే శ్రీరాంపూర్ నుంచి ప్రచారం ప్రారంభించారు. కంపెనీలో పెద్ద ఏరియా కావడంతో ఆ యూనియన్ అధ్యక్షుడు వీ.సీతారామయ్య ఇక్కడి నుంచే గేట్ మీటింగ్ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఐఎన్టీయూసీ నాయకులు కూడా ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ శ్రీరాంపూర్ నుంచే ప్రచారం చేపట్టారు. ఇక మరో కార్మిక సంఘం హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మందమర్రి ఏరియా శాంతిగని నుంచి ప్రచారం చేపట్టి అన్ని ఏరియాల్లో పర్యటిస్తున్నారు. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. ఇక సీఐటీయూ నాయకులు ఈసారి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై గురువారం శ్రీరాంపూర్‌లోని ఆ యూనియన్ కార్యాలయంలో కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వీరయ్య, సింగరేణి విభాగం గౌరవ అధ్యక్షుడు రాజారావు తదితర ముఖ్యులతో అన్ని డివిజన్ల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ప్రచారం ముమ్మరం చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే ఆర్జీ 1 ఏరియాలో జీడీకే 2ఏ గనిలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య గని ప్రాంగణంలోని మైసమ్మ ఆలయంలో కొబ్బరి కాయ కొట్టి ఎన్నికల ప్రచారం చేపట్టి డివిజన్ల వారీగా గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు.

**ఎన్నికలపై టీబీజీకేఎస్‌కు కవిత దిశానిర్దేశం**

అసెంబ్లీ ఫలితాలతో డీలా పడ్డ టీబీజీకేఎస్ నాయకులు ఇంకా ఎన్నికల ప్రచారం ప్రారంభించలేదు. సమయం సమీపిస్తుండడంతో ఆ యూనియన్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం యూనియన్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో దిశానిర్దేశం చేశారు. సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలతో యువ కార్మికులు చాలామంది యూనియన్‌లో పని చేస్తున్నారని, ఇక యూనియన్‌లో సగం పదవులు యువ కార్మికులకు దక్కేలా హామి ఇచ్చి ఎన్నికల్లో వారి సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని నేతలకు సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. ఉన్న క్యాడర్ చెదిరిపోకుండా కాపాడుకోవాలని సూచించారు.

**చేరికలకు అధిక ప్రాధాన్యం**

అన్ని కార్మిక సంఘాలు తమ బలాన్ని పెంచుకోవడం కోసం చేరికలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రత్యర్థి సంఘాల్లో ఉన్న అసంతృప్తులతో చర్చిస్తూ తమ సంఘంలో చేర్పించుకుంటున్నారు. ఇప్పటివరకు గనులపై ఉన్న సంఘాల నిర్మాణ లోపాలను కూడా ప్రచారంలో భాగంగా చేరికలు చేపట్టి మరింత బలోపేతం చేస్తున్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఊపులో ఐఎన్టీయూసీ నాయకులు చేరికలను అధికంగా ప్రోత్సహిస్తున్నారు. ఇతర సంఘాల నుంచి శ్రీరాంపూర్‌లో పెద్దయెత్తున కార్యకర్తలు ఐఎన్టీయూసీలో చేరారు. ఏఐటీయూసీ కూడా చేరికలపై దృష్టి సారించింది. నిన్న మొన్నటి వరకు కార్మిక వాడల్లో అసెంబ్లీ ఎన్నికలతో హోరెత్తిన ప్రచార పర్వాలు నేడు గుర్తింపు సంఘం ఎన్నికలతో అవి గనులపైకి చేరాయి.

# ఎస్‌ఎంసీల పదవీ కాలం పొడగింపు

- నెలాఖరు లేదా కొత్త కమిటీ ఏర్పాటయ్యే వరకు



మంచిర్యాలలోని బాలుర పాఠశాల

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) పదవీ కాలం మరోసారి పొడగించారు. గత నాలుగేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో పదవీకాలం పెంచుతూ వస్తున్నారు. గత నెల 30న కాల పరిమితి ముగియడంతో ఈ నెలాఖరు లేదా కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పొడగిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకురాలు దేవసేన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీలను రెండేళ్లకోసారి ఎన్నుకోవాలి. నాలుగేళ్ల క్రితం జిల్లాలో 839 పాఠశాలల్లో విద్యాకమిటీల ఎన్నికలు నిర్వహించారు. తర్వాత కాలంలో కాల పరిమితిని ఆరునెలలపాటు పొడగిస్తూ వచ్చారు. మరోసారి ఈ నెలాఖరుకు పెంచారు. పాఠశాలలు ప్రజల భాగస్వామ్యంతో పని చేసేలా సౌకర్యాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారు. అంతకుముందు 1992లో పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటయ్యాయి. తర్వాత 1998లో పాఠశాల విద్యాకమిటీలను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అనంతరం విద్యాహక్కు చట్టం–2009 అమల్లోకి వచ్చిన తర్వాత అంతకుముందున్న విద్యాకమిటీలను పాఠశాల యాజమాన్య కమిటీలుగా మార్పు చేస్తూ 2019లో ఎన్నికలు నిర్వహించారు. ఎస్ఎంసీలు పాఠశాల అభివృద్ధితోపాటు ప్రభుత్వం మంజూరు చేసే నిధులను సక్రమంగా ఖర్చయ్యేలా చూడాల్సి ఉంది. దీనికి తోడు విద్యార్థులకు నాణ్యమైన బోధన, మెరుగైన వసతుల కల్పనలో కీలకపాత్ర పోషిస్తాయి. మధ్యాహ్న భోజనం నిర్వహణపై పర్యవేక్షిస్తారు. బడీడు పిల్లలను పాఠశాలకు రప్పించడంలో, బడిబయట పిల్లలను తిరిగి తీసుకురావడంతో ఉపాధ్యాయులు సత్ఫలితాలు సాధించే వీలుంటుంది. పిల్లల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి వివిధ అంశాల(నమోదు, హాజరు, ప్రగతి, వసతుల కల్పన వంటివి)పై చర్చించడం, భాగస్వాములుగా చేయడం ఎస్ఎంసీల బాధ్యత.

**బడి మనదే.. బాధ్యత మనదే..**

ఇదివరకు పాఠశాల అభివృద్ధికి బడి మనదే..బాధ్యత మనదే కార్యక్రమంలో భాగంగా స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ(ఎస్ఎంసీ) సభ్యులకు శిక్షణ ఇచ్చారు. రెండ్రోజులపాటు జూమ్ యాప్ ద్వారా అవగాహన కల్పించారు. మొత్తం 839 పాఠశాలల కమిటీలు పాల్గొన్నాయి. కరోనా విజృంభించిన క్రమంలో పాఠశాల బలోపేతం ధ్యేయంగా కమిటీలకు జూమ్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

# బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్‌పర్సన్
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వినోద్



శ్వేతను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వినోద్

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో తీవ్ర నిరాశలో ఉండగా.. బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఆమె భర్త శ్రీధర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో చైర్‌పర్సన్ దంపతులు, మరికొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వినోద్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ప్రస్తుతం ఈ అంశం మున్సిపాల్టీలో సర్వత్రా చర్చనీయాంశమైంది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అనుచరురాలిగా ఉన్న శ్వేత ఆకస్మికంగా పార్టీ మారడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ వైపు ఎన్నికల్లో ఓడిపోయి గడ్డు పరిస్థితుల్లో ఉండగా కాంగ్రెస్ పార్టీలోకి వరుస చేరికలు మింగుడు పడడం లేదు. ఎన్నికలకు ముందే పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా ప్రస్తుతం చైర్‌పర్సన్ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్ కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో ఎదురుదెబ్బలు తగులుతుండడం గులాబీ శ్రేణులు తట్టుకోలేక పోతున్నారు.

**వ్యూహాత్మక ఎత్తుగడతో చేరిక**

వ్యూహాత్మక ఎత్తుగడల్లో భాగంగా శ్వేత దంపతులు కాంగ్రెస్‌లో చేరినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు అనుకున్న విధంగానే ఎమ్మెల్యేతో సంప్రదింపులు జరిపి కాంగ్రెస్‌లో చేరడానికి లైన్ క్లియర్ చేసుకున్నట్లుగా చెబుతున్నారు. బెల్లంపల్లి నాయకులతో శ్వేత మాట వరుసకైన చెప్పకుండా, ఎమ్మెల్యే సైతం స్థానిక నాయకుల అభిప్రాయాలను తీసుకోకుండానే ఏకపక్షంగా కండువా కప్పినట్లు కాంగ్రెస్ వర్గీయులు చర్చించుకుంటున్నారు. శ్వేత నిర్ణయంతో అసమ్మతి కౌన్సిలర్లు కంగుతిన్నారు. ఓడిపోయామని బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్య పడొద్దు, అండగా ఉంటానని మూడు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భరోసా ఇచ్చినప్పటికీ శ్వేత కాంగ్రెస్‌లోకి జంప్ కావడంతో బీఆర్‌ఎస్‌లో కలకలం రేపింది. మరికొందరూ వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

# వీడని ముసురు



ధాన్యం కుప్పలపై కవర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: తుపాన్ ప్రభావంతో మూడు రోజు గురువారమూ మబ్బులు కమ్ముకొని ముసురు వర్షం కురుస్తూనే ఉంది. బుధవారం నుంచి గురువారం వరకు 2.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విపరీతమైన చల్లని ఈదురుగాలులు వీస్తుండడంతో జిల్లా వాసులు చలికి వణికిపోతున్నారు. అన్ని మండలాల్లో చిరుజల్లులు కురుస్తుండడంతో సాధారణ జనాలతోపాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం కుప్పలుగా పోసిన రైతులు కవర్లు కప్పేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సాధ్యమైనంత త్వరగా ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించాలని కోరుతున్నా.. సేకరణలో వేగవంతం చేయాల్సిన సివిల్ సప్లయ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ముసురు వర్షంతో వరికోతలు, పత్తితీత పనులు ఆగిపోయాయి. భారీ వర్షం వస్తే పంట నీటి పాలవుతుందని రైతులు వాపోతున్నారు. నస్పూర్ మండలంలో 4.4 మిల్లీమీటర్లు, మంచిర్యాలలో 4.4, హాజీపూర్‌లో 3.4, తాండూర్‌లో 3.1, లక్సెట్టిపేటలో 2.6, భీమినిలో 2.4, భీమారంలో 2.2, బెల్లంపల్లిలో 2.1, వేమనపల్లిలో 1.5, కన్నెపెల్లిలో 1.2, నెన్నెలలో 1.2, మందమర్రిలో 1.9, జైపూర్‌లో 1.9, చెన్నూర్‌లో 1.2, జన్నారంలో 0.7, దండేపల్లిలో 0.5, కోటపల్లిలో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**చలితో వణుకుతున్న జనం**

మూడు రోజులుగా మబ్బులు కమ్ముకోవడం, చిరుజల్లులు కురుస్తుండడం, చల్లని ఈదురు గాలులు వీస్తుండడంతో వణుకుతో ఇంటికే పరిమితం అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వెట్టర్లు, జర్కిన్లు వేసుకోనిదే బయటకు రావడం లేదు. రాత్రివేళ గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాల వద్ద రైతులు చలిమంటలు వేసుకుంటున్నారు. ఉదయం, రాత్రి షిఫ్టుకు విధులకు వెళ్లే సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితులతో తీవ్ర అనారోగ్యంతో కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. జలుబు, జ్వర పీడుతల సంఖ్య పెరిగిపోతోంది. సాయంత్రం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

## క్లుప్తంగా

### చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.13 గ్రామానికి చెందిన భరుణ్‌కుమార్ ఇంట్లో పూజామందిరంలోని హుండీని కర్ణాటకలోని రాయిచూర్‌కు చెందిన సుకుమార్ దత్తా పగులగొట్టి రూ.45 వేలు దొంగిలించాడు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.42 వేలు రికవరీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### టీఎన్జీవోస్ సభ్యత నమోదు



సభ్యత్వం నమోదు చేయిస్తున్న శ్రీహరి

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో సభ్యత్వం నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, సంయుక్త కార్యదర్శి సునీత, తిరుపతి, లక్ష్మణ్ కుమార్, ప్రణవ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రంలో చాలా కాలంగా పేరుకుపోయిన విద్యారంగ సమస్యలు నూతన ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ టీచర్ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం కోరారు. గురువారం మంచిర్యాలలో టీయూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు, జీపీఎఫ్‌టీఎస్ బిల్లు చెల్లింపులు, హెల్త్‌కార్డు, మెడికల్‌బిల్లుల చెల్లింపులు తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి సత్తయ్య, బన్న రవీందర్, జిల్లా నాయకులు చిన్నయ్య, బానయ్య, సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

### క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

ఇంద్రవెల్లి(ఖానాపూర్): క్షణికావేశంలో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలంలోని వజ్జర గ్రామానికి చెందిన కవిత (26)కు ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన గేడం జ్యోతిరాంతో 2021లో వివాహమైంది. గురువారం ఉదయం జ్యోతిరాం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో కవిత ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు తండ్రి సిడాం లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# ఆదివాసీ గూడెం నుంచి అసెంబ్లీకి..

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రస్థానం
- స్వగ్రామం ఉట్నూర్ మండలం కల్లూర్‌గూడ
- కష్టపడి చదివించిన తల్లిదండ్రులు
- ఆదివాసీ హక్కుల కోసం పోరాటం..
- రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా గుర్తింపు..
- ఎన్నికల్లో గెలుపొందడంపై గ్రామస్తుల హర్షం



ఇందిరమ్మ ఇంటి ఎదుట బొజ్జు కుటుంబ సభ్యులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): కొండకోనల్లో విసిరి పడేసినట్లు ఉన్న చిన్నపాటి గ్రామం కల్లూరుగూడ. ఉట్నూర్ మండలం ఘన్‌పూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఈ గ్రామం వెలిసింది. గ్రామంలో 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన వెడ్మ బొజ్జు పటేల్ ఈ గ్రామానికి చెందిన వాడే. చిన్నపాటి గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో బొజ్జు కుటుంబం నివాసం ఉంటోంది. తల్లిదండ్రులు గిరిజాబాయి, భీంరావు దంపతులు వ్యవసాయం చేస్తూ కష్టపడి బొజ్జును చదివించారు. తమ కొడుకు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని ఆ తల్లిదండ్రులు కన్న కలలు నేడు నెరవేరాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బొజ్జు గెలుపొందడంతో గూడెంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### కష్టపడే తత్వం ఉంది



మా కుమారుడు బొజ్జుకు చిన్ననాటి నుంచి కష్టపడే తత్వం ఉంది. ఇంటి వద్ద ఎప్పుడూ ఖాళీగా ఉండేవాడు కాదు. అతని కష్టానికి ఎప్పుడూ వెన్నంటి ఉన్నాం. ఆదివాసీలకు హక్కులు కల్పించేందుకు కృషి చేస్తుండేవాడు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభలో బొజ్జుకు ప్రజల్లో ఉన్న ఆదరణను రేవంత్‌రెడ్డి గుర్తించి ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇచ్చారు. ప్రజలు ఓటు వేసి గెలిపించడం సంతోషం కలిగించింది.

– వెడ్మ భీంరావు, బొజ్జు తండ్రి

### సంతోషంగా ఉంది



మా కొడుకు ఎమ్మెల్యేగా గెలిచాడని తెలిసి మేము, మా గ్రామస్తులు ఎంతో సంతోషపడ్డాం. ఎప్పుడూ ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధి కోసం ఆలోచిస్తూ ఉండేవాడు. ఎన్నికల్లో గెలవడంతో ఈప్రాంత ప్రజలకు న్యాయం చేస్తాడని, వారి సమస్యలు పరిష్కరిస్తాడని ఆశిస్తున్నాం. బొజ్జు గెలుపొందడంతో రోజూ ఎవరో ఒకరు వచ్చి మాకు శుభాకాంక్షలు తెలపడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

– గిరిజాబాయి, బొజ్జు తల్లి

### హక్కులకోసం పోరాడుతుండేవారు



నేను కుమురంభీం జిల్లాలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నా. ముందు నుంచీ మా ఆయనకు కష్టపడే గుణం ఉంది. ఎప్పుడూ ఈ ప్రాంత ఆదివాసీల హక్కుల సాధనకోసం పోరాడుతుండే వారు. రాత్రి వరకూ ఇంటికి వచ్చే వారు కాదు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయనకు మంచి అవకాశం లభించింది. ఈ ప్రాంత అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తాడని ఆశిస్తున్నాం.

– దృపద, బొజ్జు సతీమణి

## 'గుర్తింపు ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌ను గెలిపించాలి'



మాట్లాడుతున్న రాజిరెడ్డి

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే హెచ్‌ఎంఎస్‌ను గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని ఆ యూనియన్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి కోరారు. గురువారం ఏరియాలోని కేకే-5 గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1998కు ముందు సింగరేణిలో సుమారు లక్ష మంది కార్మికులు, 55 భూగర్భ గనులు, నాలుగు ఓపెన్‌కాస్ట్‌లు ఉండేవన్నారు. కాలక్రమేణా ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ప్రస్తుతం 18 ఓపెన్‌కాస్ట్‌లు, 24 భూగర్భ గనులకు కుదించబడ్డాయన్నారు. సింగరేణి కార్మికుల హక్కులను, సంస్థను కాపాడతామని గెలిచిన సంఘాలు ప్రభుత్వాలకు బానిసై దివాళా తీయించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని ఏకైక యూనియన్ హెచ్‌ఎంఎస్ అన్నారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు సుదర్శన్, జీవన్‌జోయల్, శ్రీనివాసరెడ్డి, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 'సీఐటీయూకి ఒక్క అవకాశం ఇవ్వండి'

- యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూ యూనియన్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య కోరారు. గురువారం శ్రీరాంపూర్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో సీఐటీయూ బెల్లంపల్లి, గోదావరిఖని రీజియన్‌ల ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ కార్మికుల హక్కులను తాకట్టు పెట్టాయన్నారు. ప్రైవేటీకరణ పెరిగి కార్మికుల స్థానంలో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేయాల్సింది వచ్చిందన్నారు. సీఐటీయూ గెలిస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసిన చరిత్ర తమకు మాత్రమే ఉందన్నారు. సమావేశంలో ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పీ.రాజారావు, అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, డెప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు గొల్ల బాలాజీ, గోదారి భాగ్యరాజ్, మందమరి బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, అల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి పథకం అమలు చేస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్ గెలిపిస్తే కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఆర్కే 5బి గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ వైఫల్యం వల్ల నేడు సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు విజ్ఞతతో ఆలోచించి ఏఐటీయూసీని గెలిపించాలన్నారు.

**పలువురి చేరిక..**

ఈ సందర్భంగా సుమారు 150 మంది కార్మికులు, ఇతర సంఘాలకు చెందిన కార్యకర్తలు ఏఐటీయూసీలో చేరారు. వారికి సీతారామయ్య కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రమోహన్, పిట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## కార్మికుల పక్షాన హెచ్‌ఎంఎస్ పోరాటం

- యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసే ఏకైక సంఘం హెచ్‌ఎంఎస్ మాత్రమేనని ఆ యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మూడు సార్లు ఏఐటీయూసీ, ఒకసారి ఐఎన్టీయూసీ, రెండు సార్లు టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే 1,60,000 మంది ఉన్న కార్మికులను 39 వేలకు తగ్గించారన్నారు. 72 భూగర్భ గనులు ఉంటే నేడు వాటి సంఖ్య 18 కి చేరిందన్నారు. ఇలాంటి సంఘాలు మళ్లీ గెలిస్తే కార్మికులు మరింత అన్యాయం జరగడం ఖాయమన్నారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి గొల్ల సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

### ఐఎన్టీయూసీలో పలువురి చేరిక



చేరిన వారితో జనక్‌ప్రసాద్

జైపూర్(చెన్నూర్): ఎస్సార్పీ ఏరియాలోని వివిధ యూనియన్లకు చెందిన పలువురు నాయకులు గురువారం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరమల్లు, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, రవి, నర్సింగ్, సమ్మిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### సెట్‌లో అధ్యాపకుడి ప్రతిభ



కరుణాకర్‌ను అభినందిస్తున్న ఎంఈవో

జన్నారం(ఖానాపూర్): సెట్ (స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్) పరీక్షలలో జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు బీ.కరుణాకర్ రసాయన శాస్త్ర విభాగంలో ప్రతిభ కనబరిచారు. డిగ్రీ కళాశాల లెక్చరర్ పదోన్నతి కోసం అక్టోబర్ మాసంలో నిర్వహించిన సెట్ పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి వెలువడ్డాయి. డిగ్రీ లెక్చరర్ పదోన్నతికి కరుణాకర్ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కరుణాకర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, అధ్యాపక బృందం, పీఆర్టీయూ అధ్యక్షుడు కట్ట రాజమౌళి అభినందించారు.

### నేడు ఎంపిక పోటీలు

నిర్మల్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి అండర్-14, అండర్-17 టెన్నికాయిట్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోన్ మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు సంబంధిత ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన 4 ఎలిజిబిలిటీ ఫారాలు, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు మంగళారపు వెన్నెలను 9908963333 నంబరులో సంప్రదించాలని సూచించారు.

### మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

నేరడిగొండ(బోథ్): మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శంకరాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ శేఖర్ (26) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. బుధవారం ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడి ఇంటినుంచి వెళ్లగొట్టాడు. రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు.

## చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం



కలెక్టర్‌కు సంతకాల నోటీసు ఇస్తున్న కౌన్సిలర్లు

- కలెక్టర్‌కు 19 మంది కౌన్సిలర్ల నోటీసు
- పార్టీల కతీతంగా సంతకాలు
- చైర్‌పర్సన్ కాంగ్రెస్‌లో చేరిన రోజే ఏకతాటిపైకి కౌన్సిలర్లు
- వేడెక్కిన పుర రాజకీయాలు

బెల్లంపల్లి: ముందుగా ప్రకటించినట్లుగా బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకమయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసానికి తెరతీశారు. గురువారం కలెక్టర్ బి.సంతోష్‌కు 19 మంది కౌన్సిలర్లు వారిద్దరిపై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ సంతకాలతో కూడిన నోటీసును అందజేశారు. అవిశ్వాసాన్ని కోరుతూ సంతకాలు చేసిన వారిలో కౌన్సిలర్లు షేక్ అఫ్సర్, దామెర శ్రీనివాస్, పోతరాజుల లీల, కెమిశెట్టి సరిత, అనిత యాదవ్, ఎలిగేటి సుజాత, పోలు ఉమాదేవి, సూరం సంగీత, సుకేశిని భరద్వాజ్, తుంగపల్లి సుజాత, కొక్కెర చంద్రశేఖర్, గురుండ్ల లక్ష్మి, రాజనాల కమల, నెల్లి శ్రీలత, కొమ్ముల సురేష్, పత్తిపాక రేణుక, బొడ్డు విజయ తిరుమల, బుక్య రాము నాయక్, మాటూరి మధు ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లతో పాటు స్వతంత్రులూ సంతకాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ శ్వేత హైదరాబాద్ కేంద్రంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించాలని నోటీసు అందజేయడం కలకలం రేపింది.

**అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదనే..**

మున్సిపల్ ఎన్నికలు జరిగి దాదాపు నాలుగేళ్ల పదవీ కాలం దగ్గర పడుతోంది. ఇన్నేళ్లలో సహచర కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వకపోవడంతో పాటు అభివృద్ధి పనుల్లో సరైన వాటా కల్పించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేశారనే అసంతృప్తి, ఆవేదన గూడుకట్టుకుంది. ఆ అక్కసుతోనే అవిశ్వాసం ప్రకటించడానికి ముందుకు వచ్చినట్లుగా చెబుతున్నారు. మెజార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్లే ముందుకు రావడంతో ఇతర కౌన్సిలర్లు జత కలిసినట్లుగా తెలుస్తోంది. రాజకీయ వైరుధ్యాలను పక్కకు పెట్టి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను కుర్చీలోంచి దింపడమే ఏకైక లక్ష్యంగా అసమ్మతి కౌన్సిలర్లు సంఘటితంగా ఏర్పడినట్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను సంప్రదించకుండానే..**

అవిశ్వాసానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్, తాజా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యలతో ఆయా పార్టీల కౌన్సిలర్లు సంప్రదించనట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల నుంచి చిన్నయ్య చెప్పినట్లుగా విన్నా తమకు ప్రాధాన్యత దక్కలేదని బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మండిపడుతున్నారు.

**మారిన సమీకరణలు**

మున్సిపాలిటీలో ఇటీవల రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా బీఆర్ఎస్ 25, కాంగ్రెస్ 2, బీజేపీ నుంచి 1 కౌన్సిలర్ ఉన్నారు. మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఐదుగురు బీఆర్ఎస్‌లో చేరగా, ఒకరు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ మున్సిపల్ కౌన్సిలర్లు పత్తి పాక రేణుక, కొమ్ముల సురేష్, మాటూరి మధు, బూక్య రాము నాయక్ (బీఆర్ఎస్), సూరం సంగీత(ఇండి) కాంగ్రెస్‌లో చేరారు. అవిశ్వాసం ప్రకటించడానికి ఇటీవల పార్టీ మారిన కౌన్సిలర్లతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఏకతాటిపైకి వచ్చారు.

## ముగిసిన రైతుల విజ్ఞాన యాత్ర




విజ్ఞాన యాత్రలో పాల్గొన్న రైతులు

బెల్లంపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల ఉమ్మడి జిల్లాల పరిధిలోని రైతులు రెండు రోజుల విజ్ఞానయాత్ర గురువారంతో ముగిసింది. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో గిరిజన, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద దత్తత గ్రామాలకు చెందిన 40 మంది రైతులను ఎంపిక చేసి విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. పండ్ల మొక్కల పెంపకం, తోటల యాజమాన్యంపై సిద్దిపేట జిల్లా ములుగులో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, చిరు ధాన్యాల సాగు, రైతు సంఘాల ఏర్పాటు, విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి రాజేంద్రనగర్‌లో ఉన్న జాతీయ చిరు ధాన్యాల పరిశోధన కేంద్రానికి, వ్యవసాయ రంగంలో కొత్తగా వస్తున్న యాంత్రీకరణ, నూతన వంగడాలు, సమగ్ర పోషక, కలుపు, చీడ పీడల యాజమాన్య విధానాలపై అవగాహన కల్పించడానికి హైదరాబాద్‌లోని ఏటీఐసీ విభాగానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా అంబుడ్స్‌మెన్ శివరాం

వేమనపల్లి(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన పల్లెప్రగతి, ఉపాధిహామీ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అంబుడ్స్‌మెన్ శివరాం మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలను పెంచాలని, నర్సరీ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బాపురావు, ఏపీవో సత్యప్రసాద్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## దూరం తగ్గించిన నేషనల్ హైవే అధికారులు




భీమారంలో ఏర్పాటు చేసిన తప్పుడు సూచిక

భీమారం(చెన్నూర్): మండల కేంద్రం నుంచి ఆరెపల్లి గ్రామానికి గల దూరాన్ని తగ్గిస్తూ నేషనల్ హైవే అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. మంచిర్యాల-చెన్నూర్ మధ్య జాతీయ రహదారుల శాఖ మార్గమధ్యలో ఉన్న గ్రామాల వద్ద వాటి పేర్లతో రహదారికి దూరంలో ఉన్న గ్రామాల పేర్లు, ఎన్ని కిలోమీటర్లు ఉందని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా భీమారం నుంచి ఆరెపల్లికి వాస్తవంగా 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే నేషనల్ హైవేస్ నిర్లక్ష్యంగా వ్యవహరించి కేవలం 2 కిలోమీటర్లు ఉందని చెబుతూ బోర్డు పెట్టడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జరిగిన తప్పును సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

### గూడెంలో కార్తీక పూజలు



దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక సందడి కొనసాగుతోంది. నిత్యం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. పలువురు దంపతులు సామూహిక సత్య నారాయణ వ్రతాలు నోముతున్నారు. గురువారం ఆలయ ఆవరణల్లో ధ్వజస్తంభం, గుట్ట కింద రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

– దండేపల్లి